# మునుసుబు కచేరిలో మనిషి

**తూ**ర్పు ముఖంగా వున్న ఆ శివుడి ముందర ఖాళీ జాగా అది. గుడికి దక్షిణాన మునుసుబు కచేరి, దానికి పక్కనే పెద్ద ప్రహరీ గోడలున్న మనుసుబు బసవయ్య యిల్లూ, గుడికి ఉత్తరపు దిక్కున తూర్పు పడమరలకు వెళ్లే పెద్ద రోడ్డు. రోడ్డు పక్క రెండు ఆసాముల పెద్ద లోగిళ్ళు, గుడికి ఎదురుగా తూర్పు దిక్కున ఒక పెద్ద మండువా లోగిలి, దాని పక్క కోమటి దుకాణం వున్నాయ్.

ఖాళీ జాగా మధ్యలో ఒకరాతి మంటపం, దాని పక్కన పెద్ద రావిచెట్టూ వున్నాయ్. సంధ్యవేళ దాటి యిళ్ళల్లో కిరసనాయిలు దీపాలు వెలుగుతున్నాయ్. బయట చీకటి నల్లగా వుండి ఆ చీకట్లో రావిచెట్టు పెద్దపెద్ద కొమ్మలు నాలుగు దిక్కులకు విస్తరించుకుని జుట్టు విరబోసుకున్న బ్రహ్మరాక్షసుడల్లే అగుపిస్తున్నది.

ఆ చెట్టు కింద ఆ సమయంలో ముందు నలుగురు మనుషులు చేరి, కాసేపట్లోనే ఒకరివెంట ఒకరు తోసుకుంటూ ఓ నలభై యాభై దాదాపు జనం అక్కడకు చేరి, గుంపుగా పోగైనారు.

"అసలు యిసయంఏంది?" అనడిగారు, అప్పుడే గుంపులో చేరిన కొందరు మనుషులు.

"ఏమో, మాకు మటుకేం తెల్సూ, యీదంతా యీడుంటే మేమూ ఒచ్చాం! ఎహె తోయమాకండీ" అని కొందరంటుంటే-

"వుండండి, వుండండి ఆచ్చేసులేందో మాట్టాడ్తుండాడు!" అనన్నారెవరో.

"రాగవులు మావను పట్టుకుని మునుసుబు కచేరీలో బెట్టి తలుపులు బిగిచ్చారు!" అన్నాడు పొట్టి క్రాపింగు, పొట్టి కాలరు చొక్కా, పంచపైకి బిగ్గట్టి రావిచెట్టు మొగదల్లో నుంచున్న ఆదిశేషు, పాతికేళ్ళ పడుచు మనిషి.

గుండు పెల్తే శ్వాస బిగతీసుకు పోయినట్టు - నేలకు కరుచుకుపోయి వింటున్నారు జనం.

"పెడ రెక్కలిరిసి తంబానిక్కట్టేసి ఒల్లు యిరగ బొడిశాడంట!" అన్నాడు, ఆదిశేషు పక్కన నుంచున్న అదే వయసు వీరయ్య.

"ఎవరా పన్జేసింది?" అడిగారు గుంపులోంచి.

"యింకెవరుంటారు, మునుసుబు బసవయ్య!" అన్నాడు ఆదిశేషు.

"ఏందీ– మునసబు బసవయ్యా?" అడిగారు జనంలోంచి, విన్నది గట్టి చేసుకుంటానికన్నట్టు,

"అయితే ఏందో జరిగుంటది" అన్నారు కొందరు.

"యింకేం జరగాలా, మడిసి నావజాన తంబానిక్కట్టేసి నలగ బొడిశారంటంటే!" అన్నారింకోరు.

"అరవమాకండి– పెద భావయ్యా ఒత్తా వుండాడు, పక్కకు తప్పుకోండి" అన్నారెవరో ఒస్తున్న పెద భావయ్యకు దారి ఒదుల్తూ.

పంచా, పై వుత్తరీయం కప్పుకొని, వాలిన బొద్దుమీసం, తల నెరిసినా గడకర్రల్లే బారుగావుండి, చేతి వెదురు కర్రతో ఒచ్చినుంచుని, అక్కడ చేరిన గుంపును మొత్తంగా ఓ చూపు చూసి "ఏందిరా యీ జాతర ఆచ్చేసూ?" అనడిగాడు పెద భావయ్య, వూరికి పెద్ద. "రాగవులు మావఁను కచేర్లోకి బిలిసి తంబానిక్కట్టేసి యిరగదన్నాడంట మునుసుబు!" చెప్పాడు ఆదిశేషు.

"రాగవులు ఎవుర్జోలికెల్లే మనిసికాదే?" అన్నారెవరో జనంలోంచి.

"మంచోడు!" అన్నారెవరో.

"అయితే మునుసుబు బసవయ్యే సెడ్డాడంటా?" యింకెవరో అన్నారు.

"మంచో, సెడో, మడుసు ల్నావజాన లోనబెట్టి కొడ్తారెట్టా, ఎంత మునుసుబైతే మటుకు?" యింకోరన్నారు.

"ఏందిరా యా కాగ్గోల? మమ్మల్ని మాట్టాడ్నీకుండా ఏందీ లొడ లొడ? ముంగల రాగవులేం జేశాడో అది గూడా యిశారించక్కర్లా?" అంటూ మడత పెట్టిన వుత్తరీయం బుజాన వేసుకుని పంచె పైకెగ్గట్టి, వయసు మళ్ళిన ఆసామి, పెద్ద మనిషి, వెంకటాద్రి చేతికర్రతో అక్కడకొచ్చీ రావటంతోటే జరుగుతున్న వ్యవహారంలో తనూ కలిసిపోయినాడు.

"ముంగల ఆచ్చేసును యిసయం సొంతం చెప్పనిస్తే ఎవారమేందో తేలిపోద్దిగా! ఎంకటాద్రి మావాఁ?" అన్నాడు, వెంకటాద్రి వెనకనే వచ్చిన బొద్దుగా పిడిరాయల్లే వున్న బుగ్గమీసాల రత్తయ్య– పెద్దమనిషి, ఆసామి...

"సందేల రాగవులు మావఁ యిటుగా ఎల్తున్నాడంట, ఎంటనే కచేరి ముంగలుండ ఎట్టివాళ్ళు ఆదాయి, పోలాయిలు గబగబొచ్చి రాగవులు మావఁను కచేర్లోకి

లాక్కెల్లి తలుపులు బిగించారంట! యిదేందో 'తమాశగుండదే?' అని యిక్కడ మంటపం తంబంకాడున్న సూరాయి సుత్తావుండేతలికి, కచేరీలోంచి అరుపులు యినొచ్చినయ్యంట. ఎంటనే సూరాయి కచేరీ సావిడి వెనకమాల వుండ కిరికిటీ కాడికి లగెత్తి తొంగిసూసేతలికి లోన తంబానిక్కట్టేసున్న రాగవులు మావఁను మునుసుబు అదేమయిన తన్ని, బయటికొచ్చి తలుపు వేయించి ఆదాయి, పోలాయిల్ని ఆడ కాపలా వుండమని యింటికెల్లి కూకున్నాడంట. ఎంటనే సూరాయొచ్చి నాతో యిసయం అంతా సెప్పాడు!" అన్నాడు ఆదిశేషు.

"సిత్రంగా వుండదే?" అన్నారు జనంలోంచి.

"మడుసు లేమవుతారు, ఆవజాన దారేబోయే వాళ్ళను లోనకు లాక్కెళ్ళి తలుపులేసి బాత్తుంటే?" అన్నారు జనంలోంచి.

"మరాయనగోరు మునుసుబాయెను!" అన్నారు జనంలోంచి.

"ఎహె అరవమాకండి, మాటకుముంగల గీగామంటూ. ఏం, పెదభావయ్య మావాఁ. యిసయం యిన్నావుగా?" అడిగాడు బుగ్గమీసాల రత్తయ్య.

"యింటానే వున్నా మరి! ఏరా ఆచ్చేషూ, యింతకీ నువనేదేంటీ?" అడిగాడు పెదభావయ్య, ఆదిశేషును.

"నేనంటం ఏంది పెదభావయ్య మావాఁ. నేను యిన్నదే మీరూ యిన్నారు? యిగ ఏం జేయ్యాలో పెద్దమడుసులు మీరే తేల్చండి. రాగవులు మావఁను కచేరీ లోనకు తీసుకుబోయి ఎందుక్కొట్టారో ఎవరికీ తెలవదు. రేపు నన్ను తీసుకెల్లి కొడ్తారు. ఎల్లుండి నీ వొంతు రావచ్చు? యీ పద్దతేమన్నా బాగుండదేమో మీరే చెప్పండి?" అన్నాడు ఆదిశేషు.

"యిసయం గెట్టిగా అన్నాడు!" అన్నారు జనంలోంచి.

"ఏం ఎంకటాద్రి బావా, ఏం జేద్దామంటా?" అడిగాడు పెదభావయ్య, పితలాటకం ఒచ్చిందనుకుంటూ.

"ఎల్లి మునుసుబు బసవయ్యను 'యిసయం ఏంటని' అడుగుతే ఎట్టుంటదీ," తిరిగి పెదభావయ్య నడిగాడు వెంకటాద్రి.

"వుండండి – అరవమాకండి – ఎవురో తెల్లగుడ్డ లేసుకుని ఒత్తుండారు – మునుసుబు – మునుసుబు బసవయ్య ఒత్తుండాడు. పక్కకు పదండి. దారొదలండి" అన్నారు జనం. మునుసుబు బసవయ్య, ఆయన వెనక పొన్నుకర్రతో వున్న పెద్దజీతగాడు రాములుకు దారొదుల్తా.

తెల్లమల్లుపంచ, పొడుగుచేతుల తెల్లకాలరుచొక్కా రెండు రెక్క గూళ్ళ మీదగా మడతబెట్టిన సన్నజరీ తెల్లవుత్తరీయం మోకాళ్ళకిందిదాకా వేళ్ళాడ్తూ, ఒత్తుజుట్టు మధ్యగా నిలువ పాపిడ, బొద్దుకోర మీసంతో నడికారు వయసులో వున్న మునుసుబు బసవయ్య ఒచ్చి గుంపుమధ్య నుంచున్నాడు, ఎగాదిగా చూస్తూ.

"ఏమిటీ మీటింగు? ఎవరీ గుంపు" అడిగాడు మునుసుబు, అడగవలసిన పద్ధతిలో.

కాసేపు గాలి బిగ తీసినట్టయింది, జనానికి.

"రా బసవయ్యా అనుకుంటుండగానే నువే ఒచ్చావు!" అన్నాడు పెదభావయ్య, నిబ్బరంగా.

"నీకు నూరేళ్ళు బసవయ్యా, యిప్పుడే ఒచ్చింది నీమాట!" అన్నాడు వెంకటాద్రి, పైపంచ సరీగా వేసుకుంటూ.

"రాఘవుల్ని కచేరిలో పెట్టావంట, నిజమేనా బసవయ్యా?" అడిగాడు పెదభావయ్య, కాస్త పెద్దరికంగా.

"యీళ్ళంతా యిక్కడ కచేరి అనుకుంటావుంటే మేమూ యిప్పుడే యిటొచ్చి యిన్నాంలే. అయితే యివరాలేం తెలియలా!" అన్నాడు వెంకటాద్రి.

"ఎవరు– రాఘవులు విషయమా? వాడికి బుర్రలో ఎక్కడో ఏదోకీలు చెడినట్టుందిలే! అయినా పెదభావయ్య మావాఁ యీ మాత్రానికి నువు యిక్కడకెందుకూ, ఎకాయెకిని మా యింటికే ఒస్తే కాసేపు కూచున్నట్టుకూడా వుండేదిగా? ఎవర్రా యీ గుంపూ మీకేం పనీ పాట లేదూ– యింకా వెళ్ళక అట్ట చూస్తారే–వూఁ" అని మునుసుబు నోట్టోనుంచి మాట సొంతం రాకుండానే పెద జీతగాడు రాములు పొన్నుకర్రతో జనాన్ని అటెటు నెట్టినా, వాళ్ళు కొంచెం దూరం వెళ్ళినట్టే వెళ్ళి – అక్కడే చూస్తూ నిలబడ్డారు–

"పెద భావయ్య మావాఁ, మీరిక్కడున్నారని తెలిసి నేనే యిటొచ్చా. ఏమైనా నువు నలుగురుకు కావలసిన పెద్ద మనిషివి; జరిగిన విషయం రెండు ముక్కల్లో చెపుతే నీకే అర్థమౌతుంది.

నాకు దక్షిణపు దిక్కున యిరవై ఎకరాల పొలం వున్నదని మీకు తెలుసుగా? కాలవలకు నీరొచ్చి నా పొలం తడుస్తుంటే, నిన్న రాత్రి రాఘవులు అక్కడకెళ్ళి, ఎవరూ చూడకుండా నా పొలానికి అడ్డీవేసి, ఎగువనున్న తన రెండెకరాల పొలాన్ని ముందు తడుపుకుంటున్నాడు! ఇందాక సందేల రాఘవులు యిటు వెళ్తుంటే కచేరీలోకి పిల్చి

“చేసిన పనేమిటి” అని మర్యాదగా అడుగుతే, నన్ను నానా బూతులు తిట్టి నా మీద చెయి చేసుకున్నాడు! మీకిదే మన్నా బాగుందా పెద భావయ్య మావా?” అడిగాడు మునుసుబు.

“ఎట్టుంటదిలే!” అన్నాడు వెంకటాద్రి.

“నన్ను రాఘవులు డొక్కలో పొడవటం చూసి ఆదాయి, పోలాయిలు వాడ్ని రెండుతికి స్తంభానికి కట్టేశారు! నా పొలానికి నీరెక్కకుండా అడ్డీ వేయడం ఒక తప్పు. కచేరీలో నా మీద చేయి చేసుకోటం అంతకన్న పెద్ద తప్పు! అందుకే వాడ్ని యివాళ కచేరీలో వుంచి రేపు విచారణలో వాడి సంగతి తేలుస్తా” అన్నాడు మునుసుబు.

“రాఘవులు అట్టాటి మనిసికాదే?” అన్నారు జనంలోంచి.

“మరి అదే అంతు పట్టటంలా!” అన్నారు జనంలోంచి.

“ఎవర్రా వాళ్ళూ- పళ్ళు రాలేను! ముందు కచేరి సావిడి దగ్గర మందగా ఎవరు చేరమన్నారు - వూఁ యింకా వెళ్ళరేం - రాములూ - ” అరిచాడు మునుసుబు.

“ఏమంటా పెద భావయ్య బావా?” పెద భావయ్య నడిగాడు వెంకటాద్రి.

“మునుసుబేదో అంటున్నాడుగా మరి-?” అన్నాడు పెద భావయ్య.

“అంటే, రాగవులు మావఁ తెల్లార్లూ కచేర్లో వుండాల్సిందేనా? జరిగిందేంటని ఆ రాగవులు మావఁను కూడా రెండు ముక్కలడుగుతే తప్పేమన్నా వుంటదా?” అడిగాడు ఆదిశేషు.

“ఎవరూ- ఆదిశేషా? యింకేం చేరవలసిన ముఠా, చేరిందన్న మాట! యిదిగో పెద భావయ్య మావాఁ, రాఘవులు నా మీద చెయ్యి చేసుకున్నాడంటే మనవూరి బతుకు, పరపతి ఎంతదాకా వెళ్ళిందో మీకు అర్థమౌతున్నదనుకుంటా! యిదిగో, యీ ముఠా అంతా అదేరకం! ఒరేయి, పిచ్చిముండా కొడుకుల్లార, యిళ్ళకు పోయి ముసుగు పెట్టుకు పడుకోండి. మళ్ళీ తెల్లవార్తుందిగా మేతకూ- పోండి.”

మునుసుబు బసవయ్య ఆ రకంగా చెర్నాకోలు టాప్ మనిపించి వెళ్ళిన రెండు క్షణాలాగి ముందు పెద్ద భావయ్య, వెనక వెంకటాద్రి, బుగ్గమీసాల రత్తయ్య, ఆ వెనుక ఒకరివెంట ఒకరు ఆ జనం యింజను వెనుక గూడ్సుబండి పెట్టెలు తోసుకుంటూ వెళ్ళినట్టు వెళ్ళిపోయినారు.

ఆ నల్చదరం ఖాళీ జాగాకు నాలుగు పక్కలా వున్న శివుడిగుడి, మునుసుబు కచేరి సావిడి, మిగతా లోగిళ్ళు ఆ చీకట్లో నల్లటి అట్ట పెట్టెలల్లే నిఠారుగా వుండే రాతి

మంటపం పక్కవున్న గేడి కొమ్మల రావిచెట్టు జుట్టు విరబూసుకున్న బ్రహ్మరాక్షసుడల్లే ఆ జాగాకు కాపలాగా వుండిపోయింది.

రాత్రి కొంచెం పొద్దు పోయేదాకా మునుసుబు కచేరి ముందర కాపలావున్న ఆదాయి, పోలాయిలు, పెందరాడే నాలుగు మెతుకులు తినొచ్చి వుంటాన వూరు సద్దుమణిగి కాసేపైనాక, కచేరి లోపల కూడా గలభా లేకుంటం చూసుకుని, చల్లగా తలకు చుట్టుకున్న పైపంచలు తీసి, కచేరి పంచలో కిక్కురు మనకుండా ఆ పైపంచలు ముసుగేసి కప్పుకుని పడుకున్నారు.

ఆ చీకట్లో రెండు చుండు నాయకుల కుక్కలు ఎక్కణ్ణుంచో హుషారుగా తోకలాడించుకుంటూ ఒచ్చి రాతి మంటపం ఎక్కి, కింద పరిచిన బండరాళ్ళను ఒకటికి నాలుగుసార్లు వాసనచూసి, ఒక రాతి స్తంభం మీద మూత్ర విసర్జన చేసి, గిరుక్కున తిరిగి ఎటో వెళ్ళి పోయినై- ఒచ్చిన పనేదో అయిపోయినట్టు.

రెండు నల్లటి విగ్రహాలు- మెల్లగా కదుల్తూ వచ్చి ఆ గేడికొమ్మల రావిచెట్టు కింద నుంచున్నయి.

యిది చూసి యింకో నాలుగు విగ్రహాలు కదిలి, ముందు రెండు విగ్రహాల ఎదురుగా ఒచ్చినుంచున్నయి...

"సుబ్బన్న, ఎంకన్న, లచ్చన్న, సూరాయిలు వుండారా?" అనడిగింది ఆదిశేషు విగ్రహం.

"నలుగురం వుండాం" అన్నాయి, నాలుగు విగ్రహాలు.

"మన పని అట్టనే దిగబడిపోయింది!" అన్నాడు ఆదిశేషు...

"సూరాయి, నువు సప్పుడు కాకుండా ఎల్లి ఆదాయి, పోలాయిలు గురక పెడ్తుండారో లేదో సూసిరా" చెప్పాడు ఆదిశేషు పక్కనున్న వీరయ్య.

వెళ్ళి, కాసేపట్లో తిరిగొచ్చిన సూరాయి "ఆ రిద్దరి గురక వూరంతా యిని పిత్తుందదిగా!" అని చెప్పాడు.

"కచేరికి ఎనకమాల కిరికిటీ వుండది, పదండి ఆడకి" అందర్నీ కలుపుకుని మెల్లగా కచేరి వెనకవేపు చేరిన ఆదిశేషు, మూసివున్న కిటికీ రెక్కలమీద ఓ చిల్ల పెంకుతో 'టిక్ టిక్' మనిపించి "రాగవులు మావా?" అని పిలిచాడు సన్నగా.

"ఎవరూ?" పీలగొంతుతో కచేరిలోంచి వినిపించింది.

"నేను ఆదిశేషును-వీరాయి, గెడ్డపలుగుందిగా కిరికిటీ గడియకాడ రెండు పోట్లు పొడు-" అన్నాడు ఆదిశేషు, వెనకనే వున్న వీరయ్యతో.

వీరయ్య కిటికీ గడియ వూడగొట్టడానికి మొదటి పోటుకే పని జరిగింది.

"తంబానిక్కట్టేసి మునుసుబు నిన్ను కొట్టాడంట, నిజమేనా రాగవులు మావాఁ ? తెరిచిన కిటికీ చువ్వలకు మొహం ఆనించి లోపలున్న రాఘవుల్నడిగాడు ఆదిశేషు.

"మునుసుబు నన్నిట్ట కొట్టాడనుకోలా- నే నుత్త ఎదవనయ్యాను-" ఏడుస్తున్న రాఘవులు గొంతు వినిపించింది లోపల్నుంచి-చీకట్లో.

"మునుసుబు పొలానికి అడ్డీవేసి, నీ పొలానికి నీలు పెట్టుకున్నావంటగా?" అడిగాడు ఆదిశేషు.

"నీలా? అడ్డీ ఏశానా? నే నే పాపం ఎరగను. మునుసుబు నా కొంప ముంచాడు," రాఘవులు ఏడవటం కిటికీ వద్దవారికి వినిపించింది.

"వీరాయి-గెడ్డపలుగుతో కిరికిటీ సువ్వలు మెలిబెట్టి పీకెయి-" సన్నగా అరిచాడు ఆదిశేషు.

ఆదిశేషు మాట సాంతం బయటకు రాకుండానే అప్పటికే వాటంగా సహం ఎత్తిపట్టుకున్న గడ్డపలుగును కిటికీ చువ్వల్లోకి పోనిచ్చి, ఒకదానివెంట యింకో చువ్వను మెలితిప్పి వీరయ్య వెంటనే పీకేయడం, ఆదిశేషు వెనకనే వీరయ్య కచేరీలోకి కిటికీ కంతకుండా దూకటం, శ్వాస పీల్చి ఒదిలే లోపలే మొత్తం జరిగిపోయినై.

"అసలేం జరిగింది మావాఁ, జరిగిందంతా చెప్పు" అడిగాడు ఆదిశేషు, స్తంభానికి రాఘవుల్ని కట్టిన తాళ్ళను వూడతీసేసి.

"ఒరేయ్ ఆచ్చేసూ, యీ యవారం యిషయాలు నీ కొద్దు. నా మాట యిను!" అన్నాడు రాఘవులు, ఆదిశేషు వాలకం గమనిస్తూ.

"యిందులో ఎవురి పానాలు పోయేదేం లేదులే రాగవులు మావాఁ! అయితే నువ్వు తిన్న దెబ్బలు తినాల్చినవా, కావా అనేగందా తేలాల్చింది?" అడిగాడు ఆదిశేషు.

"ఆచ్చేసూ, నీకాడ దాచాల్సిన పనేం లేదు నాకు- జరిగింది యిను! నా కూతురు రత్తమ్మగుణం ఎటువంటిదో మీకు తెలుసుగా?" అన్నాడు రాఘవులు.

"మనూర్లో ఎవురెట్టాటివారైందీ వూరందరికీ తెల్చు! ఏం జరిగింది మావాఁ?" అడిగాడు ఆదిశేషు ఆదుర్దాగా.

"మొన్న సందేల కన్సీకటి పడ్తుండదనంగా మునుసుబు మా యింటికెళ్ళి, చిగిరెట్టు ముట్టిచ్చుకుంటానికి కాత్తెనుప్పు యివమన్నాడంట రత్తమ్మను. యీ పిచ్చిముండ ఎంటనే పొయిలో కాల్తుండ ఓ పిడకముక్క తెచ్చి యియబోయేతలికి యింట్లో ఎవ్వరూ

లేకుండం సూసి - లటిక్కిన రత్తమ్మ సెయి పట్టుకు గుంజాడంట-" చెబుతున్నాడు రాఘవులు.

"సిడిపోతు నాయాలు, నే నాడ లేకబోతిని" అన్నాడు వీరయ్య దవడ బిగించి.

"వూళ్ళో సిన్నపిల్ల కంటపడిందంటే సాలు - కుక్క" అన్నాడు ఆదిశేషు.

"ముందలే అది ఎర్రిబాగుల్ది! బిత్తరబోయి అరిచిందంటగాని మునుసుబు నోరు మూశాడంటా - ఆ పైన అటనే ఆయన సెయి గెట్టిగా కొరికి, బయటికి లగెత్తి రామయ్యగారి గొడ్డసావిడికాడ నేను కోమటి దుకానికెల్లి వత్తావుంటే, ఒచ్చి నా మీదబడి బావురుమంది!" అన్నాడు రాఘవులు.

"ఎట్టుంది యిసయం, ఆచ్చేసూ?" అన్నాడు వీరయ్య.

"తరవాత యిసయం చెప్పు రాగవుఁలు మావాఁ?" అడిగాడు ఆదిశేషు.

"నిన్న తెల్లారి నేను పొలం ఎల్తావుంటే ఆ రామయ్యగారి సావిడికాడే మునుసుబు తగిలాడు" చెపుతున్నాడు రాఘవులు.

"డొక్కలో ఓ పోటు పొడవలా?" అన్నాడు వీరయ్య.

"నీకేమన్నా మ(త్రాదేనా, సిన్నపిల్ల సెయిపట్టి లాగావంట?" అనడిగాను.

"నీ కూతురు అంత బెదురు మనిషేం? నువింటో వున్నావేమోనని వెళ్ళి అడిగా, లేకపోయేసరికి కొంచెం నిప్పు యివ్వమన్నా. కంగారుపడ్తూ బయటికి పరుగెత్తింది! అయినా యీ మాత్రానికే కొంపేదో మునిగినట్టు అరుస్తున్నావేం. ఏంటి విషయం?" అన్నాడు మునుసుబు నన్ను దబాయిస్తూ.

"ఎందుకైనా యిగముంగల కాత్తె జాగర్తగా వుంటం మంచిది అని తుబుక్కున వుమ్మేసి వచ్చేశా - అటు మడుసు లెవరో రావడం సూసి" చెప్పాడు రాఘవులు.

"అంతేనా?" అడిగాడు ఆదిశేషు.

"అంతడ్తో ఒదుల్తాడా మునుసుబు బసవయ్యా? సందేల సీకటి పడ్తుండగా నే నిటుగా ఎల్తుండం సూసి, కచేరి సావిట్లో కూకునుండ మునుసుబు ఆదాయి, పోలాయిల్తో నన్ను లోనకు పిలిపించి అదేమయిన తన్ని - నేను బిత్తరబొయి కింద పడేతలకి-ఆదాయి, పోలాయిల్ని నన్ను తంబానికి కట్టెయమని- "వుమ్మేస్తావంట్రా-ఒల్లు దగ్గిర పెట్టుకు బతుకు యదవా" అనేసి యింటికి ఎల్లిపోయాడు మునుసుబు" అన్నాడు రాఘవులు తలదింపుకుంటూ.

"యిన్నావా ఆచ్చేసూ?" అన్నాడు వీరయ్య.

"రాగవులు మావాం యిగ సాలు, లెగు ఎల్దాం" అంటూ రాఘవుల్ని చెయిపట్టుకుని ఆదిశేషు లేవతీస్తున్నాడో లేదో ఎక్కణ్ణుంచో పరుగెత్తుకుంటూ వచ్చి రొప్పుతూ వూచలు పీకిన కిటికీలోంచి తలబెట్టి ఆచ్చేసూ, మునుసుబు బసవయ్య, పొన్నుకర్రతో పెదజీతగాడు రాములు, యింకా మెలికలు తిరిగిన పనోళ్ళను కర్రలు, పొలుగుల్తో ఎంటేసుకుని వత్తావుండాడు. "ముంగల కిరికిటీలోంచి బయటికి దూకండి" అనరిచాడు సూరాయి గొంతు వెలగురాసుకు పోయినట్టు.

"మనం యీ కచేరిలో సేరి రాగవులు మావంతో ఏదో గూడుపుటాణి సేత్తుండామని మునుసుబుతో ఆదాయి, పోలాయిలు సెప్పుంటారు. రాగవులు మావాం , యీరాయ్ కిరికిటీలోంచి ముంగల సప్పున బయటికి పదండి-" అంటూ ఆదిశేషు రాఘవులుమావం వీరాయిల్తో బయటకు దూకాడో లేదో - ఏందయ్యా నువు కసేరిలో సేసేపని ఆచ్చేసూ? అని కర్రలు పలుగుల్తో వున్న ఓ యిరవై మందిని కలుపుకుని చప్పున కిటికీదగ్గరకొచ్చి, మునుసుబు పెదజీతగాడు రాములు నిదారుగా పొన్నుకర్రతో నిలబడి అడిగాడు, మునుసుబు యింకొంచెం దూరంగా నిలబడి చూస్తుంటే.

ఆ చీకట్లో వెంటనే అడ్డొచ్చిన వీరాయిమీద "ఫెట్" మని పొన్నుకర్ర విరుచుకుపడిందోలేదో - 'టఫీ' మని పెదజీతగాడు రాములు తలమీద సప్పున పట్టం - ఆడి వెనక నుంచున్న మెలికలు తిరిగిన మునుసుబు మనుషుల కర్రలు పలుగులు "పటపట" ఆట్టం - పక్కనే రెడీగావున్న ఆదిశేషును వెనకేసుకొచ్చే ఓ యాభై మంది కుర్రకారు, మధ్యకారు జనం దుడ్డుకర్రలు, వసికర్రలు, సిరతలు, పలుపులు, కట్టెపేళ్ళతో విరుచుకుపట్టం "తల పగల్నూకండి, ఒల్లు సున్నం జెయ్యండి. ఎనికలు యిరవండి, రఖతం కక్కించండి-" అంటూ అరుపులు, పెడబొబ్బలు, రాల్న మనుషులు రాల్టం, వెంటపడి తరిమేవాళ్ళు తరుముతుంటే సందులు గొందుల్లో వూరకుక్కలు 'బొయ్ం' మంటుంటే - అంతా అయిదారు నిమషాల్లో మునుసుబు కచేరి ముందర మనిషి పురుగులేకుండా కాళీ అవటం వేడి వేడిగా నాటకాలోళ్ళ తెర దిగినట్టు - జరగవలసింది జరిగిపోయింది అక్కడ!

ఓ అరగంట గడిచినాక పెదభావయ్య యిల్లు ప్రహరీగోడల వెనక యింటి పంచ అరుగు మీద కూచున్న పెదభావయ్య, వెంకటాద్రి, బుగ్గమీసాల రత్తయ్యల ముందరకు వచ్చి నుంచున్నాడు ఆదిశేషు.

"నీ యవారం ఏం బాగుళ్ళేదు ఆచ్చేసూ?" అన్నాడు పెదభావయ్య.

"ఏ యవారం గురించి అంటున్నదీ సరిగా తెలవటంలా?" అన్నాడు ఆదిశేషు.

"నిశిరేత్తిరప్పుడు కచేరి సావిడి కిరికిటీ సువ్వలు పీకిపార్నొకి రాగవుల్ని దొంగసాటుగా నువూ, నీ ముటా ఆ కిరికిటీలోంచి బయటికి తెస్తావుంటే మునుసుబు బసవయ్య పెదజీతగాడు రాములు యింకొంతమందితో వచ్చి "ఏంది యీ అగాయిత్తెం?" అనడుగుతే నువూ, నీ ముటా ఆళ్ళ రాములూ పనివాళ్ళను రఖతం కారేట్టు పప్పు పప్పుకింద కొట్టిపారేసి ఎల్లిపోయినారంటగా?" అడిగాడు పెదభావయ్య.

"ముంగల మన మునుసుబు మనూళ్ళో కనపడ్డ ఆడపిల్లలమీద సెయిసేసుకోటం, నోరెత్తని పెద్దమడుసులమీద తను దినం ఆడే దొంగనాటకం మనకు తెలవనక్కర్లేదనుకుంటే ఆయన సెప్పే పెతి దొంగమాట మనకు నిజమవుద్ది!" అన్నాడు ఆదిశేషు.

"యిదిగో పెదభావయ్య మావాఁ, ఎంకటాద్రి బావా, రాత్తిరి అంత పెద్ద ఎవారం జరిగినాకాగూడా యిసువంటి ఏలప్పుడు ఆచ్చేసు యీడ కొచ్చాడంటే ఏదో యిసయం వుండుంటది! మనతో మునుసుబు బసవయ్య సెప్పాల్సింది సెప్పటం అయింది. ఆచ్చేసు సెప్పేదికూడా మనం యింటే అసలు యిసయం తెలిసొచ్చుద్దిగా? ఆచ్చేసూ, సప్పున నీ యిసయమేందో బయటికి రానీ?" అన్నాడు బుగ్గమీసాల రత్తయ్య.

"అటుమొన్న సందేల" చెబుతున్నాడు ఆదిశేషు. "మునుసుబు బసవయ్య రాగవులు మావఁ యింటో లేకుంటం కనిబెట్టి ఎల్లి ఒంటరిగా వుండ రత్తమ్మను సూసి చిగిరెట్టు ముట్టిచ్చుకుంటానికి నుప్పు వుండదా? అంటూ గబిక్కిన రత్తమ్మను వాటేసుకుండేతలికి– బిత్తరబోయిన రత్తమ్మ మునుసుబు సెయి గట్టిగా కొరికి బయటపడి లగెత్తుతుంటే రాగవులుమావఁ ఎదురురావడం సూసి బావురుమందట! రాగవులుమావఁ గబగబ యింటికెల్లి సూత్తే మునుసుబు యాడికో జారుకుండాడంట! మరసనాడు పొద్దున రామయ్యగారి వాములదొడ్డి మలుపులో రాగవులుమావఁకు మునుసుబు బసవయ్య తగిలేతలికి "నిన్న సందేల నాయింట్లో నువు సేసిన పనేంటి?" అని నిలదీసి అడుగుతే నీ కూతురు రత్తమ్మ వుత్త బెదురు మనిషి, ఎల్లి ముంగల దాని యిసయం చూసుకో అని రాగవులు మావఁ వుమ్మొస్తున్నా దులిపేసుకు ఎల్లిపోయి, ఆ సందేల రాగవులుమావఁ కచేరి ముంగలగా ఒంటరిగా రావడం చూసి కసిమీద ఆదాయి, పోలాయిల్తో లోనకు పిలిపించి ఒల్లు సితగొట్టి ఆడ తంబానికి కట్టేయించి యింటికి ఎల్లిపోయినాడంట. రాగవులు మావఁను ఒదిలిపెట్టొద్దనంటూ."

"యింటున్నావా పెదభావయ్య మావఁ?" అన్నాడు బుగ్గమీసాల రత్తయ్య.

"నువు యిన్నావంటయ్యా ఎంకటాద్రి బావా?" అడిగాడు పెదభావయ్య.

"యిన్నాలే. యిందులో నిజం ఎంతుండదో గెట్టిగా తెలవాలిగా?" అన్నాడు వెంకటాద్రి.

"తెలవడానికి తెల్లార్లెగుస్తే మన మునుసుబు బసవయ్యకు ఆడపిల్లలరంది ఎట్టుండేదీ వూర్లో యినరావటం మనకు తెలవందేముంటదీ? పైగా మడిసిని- తనను నిలదీసి అడిగాడని, కచేర్లో తంబానికి కట్టేసి సితగ పొడవటం మనం ఎప్పుడన్నా యిన్నామా?" అన్నాడు పెదభావయ్య.

"నాతోబాటు రాగవులు మావ౯ యిసయం తెలిసొచ్చిన మనూరి ఓ పదిమంది మంచోరు రాగవులు మావ౯ను కచేరీలోంచి బయిటికి తెద్దామని ఆడకెల్లే తలికి ఆడ రెడీగా వుండ మునుసుబు బసవయ్య మడుసులు యీ ఎల్లిన మడుసుల్ని సితగొడ్తే ఆళ్ళూ వూరుకోక తిరగబడ్డారు- యిదీ జరిగిన యిసయం, పెదభావయ్య మావ౯" అన్నాడు ఆదిశేషు.

"పెదభావయ్య మావ౯, ఎంకటాద్రి బావా, మునుసుబు బసవయ్య కాడికెల్లి యిసయం తేలిత్తే సరిపోద్దిగా?" అన్నాడు బుగ్గమీసాల రత్తయ్య, తుబుక్కున వుమ్మేస్తూ.

అయితే ఆనాటి నుంచి ఆదిశేషుగాని, రాగవులుగాని మునుసుబు కచేరి ముందర వెళ్తున్నా, లేక మునుసుబు బసవయ్య వారికెక్కడైనా ఎదురైనా ఏం జరగనట్టు ఎవరిదార్న పోతున్నా - బుసలు గక్కుతూ ఒకర్నొకరు చాటుగా చూసుకోవటం తెలుసు. ఏరోజో, ఎప్పుడో మళ్ళీ కర్రలు, కత్తులు, కఠార్లు వాళ్ళ మధ్యన విరుచుకు పడొచ్చని-అనుకునేవారు లేకపోలేదు!

ఏది ఏమైనా - ఆ రాత్రి తన నాయన రాఘవుల్ని యింటి దగ్గర భద్రంగా దింపి వెళ్ళినప్పట్నుంచీ ఆదిశేషంటే అదోరకంగా చూట్టం మొదలుపెట్టింది రత్తమ్మ.